క్లుప్తంగా

18న విద్యుత్ సంస్కరణలపై సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 18న విద్యుత్ సంస్కరణలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు, సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలను వేగవంతం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఫరూక్ హుస్సేన్ పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేయడం తగదు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ విభాగ కన్వీనర్ కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశా రు. ఈ విషయమై శనివారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల రూపంలోనే కాకుండా యూనిఫాం పేరుతో విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించాలని కోరారు.

బ్రౌన్ కేంద్రానికి 1100 పుస్తకాలు



పుస్తకాలను స్వీకరిస్తున్న బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ కేంద్రానికి బయటి ప్రాంతాల నుంచి పుస్తకాలు చేరుతూనే ఉన్నాయి. శనివారం 1100 పుస్తకాలను బ్రౌన్ కేంద్రం సిబ్బంది సేకరించారు. హైదరాబాదులోని దూరదర్శన్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు 500 పుస్తకాలు, ప్రముఖ సాహితీవేత్త, నటుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ 200, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మనాభరెడ్డి 200 పుస్తకాలు, విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ 200 పుస్తకాలు వెరసి మొత్తం 1100 పుస్తకాలను బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథ పాలకులు జి.హరిభూషణరావు, సహాయకులు నీలకంఠేశ్వర్‌లకు అందజేశారు.

నేడు చిత్ర కవితా సౌరభం పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అలంకారం వెంకట రమణరాజు రచించిన చిత్ర కవితా సౌరభం పుస్తకావిష్కరణ సభ చిత్ర సాహితీ ప్రచురణలు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమ నిర్వాహకులు అలంకారం విజయ్‌కుమార్, ఆదిత్యకుమార్‌లు ఈ మేరకు వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా హైదరాబాదుకు చెందిన చింతా రామకృష్ణారావు, ఏలూరుకు చెందిన కందుల నాగేంద్ర వరప్రసాద్ పాల్గొంటారన్నారు. ప్రత్యేక అతిథిగా బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి వ్యవహరిస్తారని, యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం అధ్యాపకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పుస్తకాన్ని సమీక్షిస్తారని, అవధాని, నాటక రచయిత ఎంవీఎల్ఎన్ ప్రసాద్, సాహితీవేత్త జీవీ సాయిప్రసాద్‌లు కూడా పాల్గొంటారని తెలిపారు.

విచారణ పూర్తయ్యాకే ఏపీజీఈఏ లెటర్స్‌ను పరిశీలించాలి

కడప రూరల్: జరగబోవు సాధారణ బదిలీలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ పూర్తయ్యాకే ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) లెటర్స్‌ను పరిగణలోకి తీసుకోవాలని ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆదాల వెంగల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేసా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

సాధారణ బదిలీలకు సంబంధించి గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల నుంచి ఆఫీస్ బేరర్స్‌కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఏపీజీఈఏ వారు ఆఫీస్ బేరర్స్‌గా అసోసియేషన్‌లో పనిచేయక పోయినా లేదా సభ్యత్వం లేకపోయినా కూడా ఆఫీస్ బేరర్స్ అని లెటర్స్ ఇచ్చారని పేర్కొన్నారు. ఎంఆర్ఓ, డాక్టర్, గజిటెడ్ ఆఫీసర్స్ హోదాలో ఉన్న వారికి కూడా బదిలీల్లో మినహాయింపు కోరుతూ లెటర్స్ ఇచ్చారని తెలిపారు. ఈ అంశాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఆ అసోసియేషన్‌పై పలు ఫిర్యాదులు వెళ్లాయని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వ అధికారి సురేష్‌కుమార్ విచారణ చేపట్టారని తెలిపారు. ఇందుకు సంబంధించి విచారణ పూర్తయినంత వరకు ఏపీజీఈఏ లెటర్స్‌ను హోల్డ్‌లో ఉంచాలని కోరారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి

– ఏపీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక పిలుపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మహిళా వ్యతిరేక విధానాల పట్ల మహిళామణులు చైతన్యవంతులు కావాల్సిన అవసరాన్ని గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రమాదంలో రాజ్యాంగం-రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో మహిళల బాధ్యత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులు నిత్యకృత్యంగా మారాయన్నారు. మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్ని విధాలా అండదండలు అందిస్తున్న కారణంగా దాడులు సర్వసాధారణమయ్యాయని తెలిపారు. కేంద్రం అవలంబిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకుగాను అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గద్దె దించడమే ప్రధాన లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్య వేదిక రాష్ట్ర నాయకురాలు నంది విజయలక్ష్మి, సంచార జాతుల సంఘం అధ్యక్షురాలు రుద్రాక్షల ఇందిరాదేవితోపాటు పలు కుల,ప్రజా, మహిళా, విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి

ఆలయానికి విరాళం

గాలివీడు : మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో వెలసిన శ్రీ వారి ఆలయ పునర్నిర్మాణ నిమిత్తం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందించినట్టు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. గత మాసంలో ఎంపీని కలిసిన కమిటీ సభ్యులు ఆలయ చరిత్ర, స్థల పురాణం, అన్నమాచార్యులు చేత కీర్తింపబడిన చరిత్ర నేపథ్యం వంటి విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా మిథున్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా ప్రకటించారన్నారు. విరాళంగా ప్రకటించిన నగదు మొత్తాన్ని శనివారం తిరుపతిలో ఆయన కార్యాలయంలో కమిటీ సభ్యులకు అందజేశారు.

రాష్ట్ర డీఓపీకి సన్మానం

గాలివీడు : రాష్ట్ర డీఓపీ జిల్లా సుదర్శన్‌రెడ్డికి మండల గాండ్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. గాండ్ల సంఘం సభ్యులు మాట్లాడుతూ సుదర్శన్‌రెడ్డి చిన్న వయస్సు నుంచే పట్టుదల, నమ్మకం కలిగిన వ్యక్తి అని, జిల్లా మరెన్నో ఉన్నతమైన పదవులు చేపట్టాలన్నారు. అనంతరం దుశ్శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గాండ్ల కులస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సూచిక బోర్డుపై టీడీపీ ఫ్లెక్సీలు



కడప వైఎస్ఆర్ సర్కిల్: ఏ ఊరికి ఎలా వెళ్లాలో ప్రజలకు తెలిసేందుకు కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిలోని అలంఖాన్‌పల్లి సర్కిల్‌లో, వైఎస్ఆర్ సర్కిల్‌లో అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్వహించిన యువగళం పాదయాత్ర సందర్భంగా ఆ బోర్డు పై భాగంలో టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు కట్టారు. దీంతో ఏ ఊరికి ఎలా వెళ్లాలో ప్రయాణికులు, వాహనదారులు బోర్డులో కనిపించకపోవడంతో స్థానికులను అడుగుతున్నారు. నిత్యం ఈ రహదారి గుండా వందలాది వాహనాలు ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటాయి. టీడీపీ నాయకులు ఫ్లెక్సీలతో వాటిని కప్పేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మురుగునీటితో ఇబ్బందులు



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ సమీపంలో మెయిన్‌రోడ్డుపైనే మురుగునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాటిని వర్షపు నీరు అనుకుంటే పొరపాటే. ఆ మురుగునీటిపైనే మోటారు బైకులు, కార్లు, బస్సులు, ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. గత రెండు, మూడురోజులుగా నీరు అధికమవుతున్నాయే తప్ప ఇంకిపోవడం లేదు. ఆర్టీసీ గ్యారేజీ పక్కన ఉన్న డ్రైనేజీ కాలువ పొంగి రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు డ్రైనేజీలోని చెత్తాచెదారాలను తొలగించి నీరు నిల్వ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

యూబీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) అందిస్తున్నసేవలు, స్కీమ్‌లను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ శ్రీ జ్ఞాన రంజన్ సారంగి తెలిపారు. శనివారం కడపలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో కస్టమర్ మెగా అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ జ్ఞాన రంజన్ సారంగి మాట్లాడుతూ "యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని రంగాల వారికి తక్కువ వడ్డీతో రుణ సదుపాయాలను కల్పిస్తున్నదని తెలిపారు. అలాగే బ్యాంకు పథకాల గురించి ఖాతాదారులకు అవగాహన కల్పిస్తూ తమ ఖాతాదారుల కోసం నూతన పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కడప ప్రాంతీయ కార్యాలయ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ తమ 49 శాఖల ద్వారా ఖాతాదారులకు అన్ని రకాల వ్యవసాయ, విద్య, గృహ, వాహన , వ్యాపార మరియు ఆసుపత్రులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని వివరించారు. బ్యాంకు యూనియన్ నారి శక్తి అనే స్కీం ద్వారా మహిళలకు అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జనరల్ మేనేజర్ శ్రీ రంజన్ ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు శాఖ మేనేజర్లు, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఖాతాదారులకి రుణపత్రాన్ని అందజేస్తున్న సెంట్రల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ శ్రీ జ్ఞాన రంజన్

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

కడప ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డితో కలిసి కడపలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లోని జగనన్న విద్యాకానుక కిట్లను, వాటి నాణ్యతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిషత్తుకు వేలాది కోట్లు ఖర్చు చేస్తూ బంగారు బాటలు వేస్తోందన్నారు. జిల్లావ్యాప్తంగా 1,58,156 మంది విద్యార్థులకు రూ. 40 కోట్ల తో 8 రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లను సోమవారం నాడు పాఠశాలల ప్రారంభోత్సవం నాడే విద్యార్థులకు అందజేయనున్నారన్నారు. అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దూరదృష్టితో గతంలో ఎవరు, ఎన్నడూ చేయని విధంగా ఎన్నో సంస్కరణలకు రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు మిట్టా కేశవరెడ్డి, కొండా దశరథరామి రెడ్డి, హెచ్ఎం సత్యసుజాతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, అంబవరం ప్రభాకర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో అంకాలమ్మకు పూజలు

సిద్దవటం : ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో అంకాలమ్మ తిరునాల సందర్భంగా శనివారం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అంకాలమ్మకు కపిర తీయుట, సాయంత్రం జల్దిలో అంకాలమ్మ ముగ్గు వేసి రాజులను రతనాలను చేసి కొలువులు అందించుట వంటి పూజలు నిర్వహించారు. తరువాత అంకాళమ్మ ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద సిద్ధయాగం, తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం అమ్మవారి గుడి చుట్టూ సుడిబండ్లు, బోనాల సమర్పణ, వంటి పూజలు జరుగనున్నాయి. సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు.



వృద్ధ తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే

ఖాజీపేట : వృద్ధాప్యం వచ్చిన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే అని లేని యెడలా వారి శిక్షార్హులని కడప అడిషనల్ సివిల్ జడ్జ్ ఎం.ప్రదీప్ కుమార్ అన్నారు. ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె పంచాయతీలోని పునీత్ లారెన్స్ వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వృద్ధులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం – 2007 ఏపీ తల్లిదండ్రులు వయోవృద్ధుల చట్టం – 2011 లోని నియమాలను వారికి వివరించారు. తల్లిదండ్రులను వదిలేసిన, వెళ్లిపోవాలని వేధించిన, వారిపై దాడులు చేసిన శిక్షార్హులని అన్నారు. మూడు నెలల జైలు శిక్ష లేదా అపరాధరుసుము, లేదా రెండూ కలపి విధిస్తారన్నారు. కడప జిల్లాలో మూడు ట్రిబ్యూనల్స్ ఉన్నాయని తెలిపారు. కడప రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, రాజంపేట, జమ్మలమడుగు అలాగే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. 14567 టోల్ ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికారి సంస్థ దృష్టికి తీసుకురావచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు చెన్నయ్య, పారా లీగల్ వలంటీర్ అరుణకుమారి, వృద్ధాశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఎం.ప్రదీప్ కుమార్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

రాయచోటి టౌన్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఏడుగురుకి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి రాయచోటి – సుండుపల్లె రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వెనకాల శిబ్యాల నుంచి బేల్దారి పని ముగించుకొని రాయచోటికి వస్తున్న పి. నాగయ్య అనే వ్యక్తి ఎదురుగా వస్తున్న ఓ అమ్మాయిని (స్కూటీలో వస్తున్న అమ్మాయి) తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో తలకు గాయం కావడంతోపాటు ఎడమ కాలు విరిగింది. అలాగే రాయచోటి – వీరబల్లె రోడ్డులోని దిగువ అబ్బవరం దాటుకొని ఇందుకూరుపల్లెకు వెళ్లే మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో నాగార్జున, జలజ, సుమతి, ఆదెమ్మ, జ్యోతి, శ్రీదేవి అనే ఆరుగురుకి గాయాలయ్యాయి. వీరిని 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల క్రమబద్ధీకరణను వినియోగించుకోండి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతిఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు కోరారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించిన గృహాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఆకుల వెంకటరమణతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బద్వేలు పట్టణంలో సుమారు 25 వేల గృహాలు ఉండగా అందులో 11461 గృహాలను క్రమబద్ధీకరణ చేసేందుకు అధికారులు గుర్తించారని వివరించారు. ఇందులో సబ్ డివిజనల్ కమిటీ విచారణ ద్వారా క్రమబద్ధీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాల్లో నిర్మించుకున్న గృహాల క్రమబద్ధీకరణ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. విచారణలో సిద్ధం చేసిన జాబితాను ఆయా సచివాలయాల్లో, తహసీల్దారు కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రచురించడం జరుగుతుందని, అభ్యంతరాల సమీక్ష అనంతరం లబ్ధిదారుని గుర్తింపు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్రమబద్ధీకరణ ప్రక్రియ ముగిసిన తర్వాత గతంలో ఉన్న రికార్డులను కూడా రద్దు చేసి నూతన డిజిటలైజ్డ్ రికార్డు సిద్ధం చేస్తామని, తద్వారా అవకతవకలకు చోటు ఉండదని తెలిపారు. ఈ క్రమబద్ధీకరణ కార్యక్రమంలో రెండు సెంట్లలోపు నిర్మాణం చేసుకున్న వారికి ఉచితంగా డీకేటీ పట్టా రెగ్యులరైజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు నుంచి నాలుగు సెంట్లు లోపు ఉన్న ఇళ్ళ నిర్మాణాలకు మార్కెట్ విలువలో 50 శాతం ధర డీడీ రూపంలో చెల్లిస్తే వాటిని కూడా రెగ్యులరైజ్ చేస్తామన్నారు. నాలుగు నుండి ఆరు సెంట్లు లోపు ఇళ్ళ నిర్మాణాలకు మార్కెట్ విలువకు సమానం, 6 నుండి 10 సెంట్లలోపు ఇళ్ళ నిర్మాణాలకు మార్కెట్ విలువలో 1.5 రెట్లు ధరతో క్రమబద్ధీకరణ చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

అర్కటవేముల గ్రామస్తులకు పరామర్శ

ప్రొద్దుటూరు : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజుపాళెం మండలం అర్కటవేముల గ్రామస్తులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం పరామర్శించారు. గురువారం రాత్రి ఎస్సీ కాలనీలో జరిగిన ఓ శుభకార్యక్రమంలో గుగ్గిళ్లు తిని 27 మంది అస్వస్థతకు గురయ్యారు. అందరూ వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందరూ కోలుకుంటారని, ఇందుకు అవసరమైన చికిత్సను డాక్టర్లు అందిస్తారని ఎమ్మెల్యే వారితో అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధి వెంకటరమణారెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, కోటా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారి..

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ కార్యక్రమానికి బంధువులు తెచ్చిన అలసంద గుగ్గిళ్లను తిని వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పితో బాధపడుతూ ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు.

ఈ క్రమంలో వారిని, గ్రామంలోని బంధువులను శనివారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ వల్లి పరామర్శించారు. అందరికీ బాగా అయ్యే వరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగించాలని ఆయ న మండల వైద్యులు మంజుల, నిఖిలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, ఖాజామొయిద్దీన్, ఎంపీహెచ్ఈఓ రవిశంకరరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి రూ. 35 వేలు నగదును సైబర్ నేరగాడు కాజేశాడు. తనకు వచ్చిన సమాచారానికి స్పందించిన బాధితులు నిందితుడు చెప్పిన మేరకు సమాచారం లింకుపై టచ్ చేసి తన దగ్గర ఉన్న సమాచారాన్ని ఇవ్వడంతో డబ్బులను కాజేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ ఉలసయ్య తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కడప నగరం తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ ఉలసయ్య తెలిపారు. సతీష్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. అతన్ని అరెస్టు చేసి 50 కిలోలు ఉన్న తొమ్మిది బస్తాలతోపాటు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు.

డిప్యూటీ సీఎంకు సన్మానం

కడప కార్పొరేషన్: ఈ ఏడాది హజ్ యాత్ర విజయవంతంగా నిర్వహించడంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా కీలక భూమిక పోషించారని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పి. ఖాదర్ బాషా అన్నారు. శనివారం వారు డిప్యూటీ సీఎంను కలిసి శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ తొలిసారి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ద్వారా హజ్‌యాత్ర నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వారికి అదనంగా ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వం రూ.14.50కోట్లు భరించి యాత్రకు పంపించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు రఫీ, సలీం, అమీర్‌బాషా పాల్గొన్నారు.

పసుపు బస్తాలకు నిప్పు



ప్రమాదంలో కాలిపోయిన పసుపుకొమ్ములు

కడప అగ్రికల్చర్: కడప వ్యవసాయ మార్కెట్‌లో 9వ తేదీ రాత్రి 10 నుంచి 11 గంటల ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి జీబీఎన్ అనే మండికి సంబంధించిన పసుపు బస్తాలకు నిప్పంటించినట్లు టర్మరిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి తెలిపారు.సంఘటనా స్థలాన్ని టర్మరిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, నాయకులు పరిశీలించారు. ఈ ప్రమాదంలో లో 10 బస్తాల పసుపు కొమ్ములు కాలిపోయి సుమారు రూ. 40 వేల నష్టం జరిగినట్లు వారు తెలిపారు. ఈ విషయమై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

సింహాద్రిపురం : గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్ హెచ్చరించారు. శనివారం సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలైన కసనూరు, దిద్దేకుంట్ల గ్రామాలను ఆయన విజిట్ చేసి ఇరు వర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో ఎటువంటి తగాదాలకు ఆస్కారం ఉండకూడదని.. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకొస్తే కౌన్సిలింగ్ ఇస్తామన్నారు.